క్లుప్తంగా

అమ్మవారికి ఆషాఢమాస పూజలు



అలంకారంలో వాసవీ కన్యకాపరమేశ్వరి

పోరుమామిళ్ల : పట్టణంలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీదేవికి ఆషాఢమాస పూజలు వైభవంగా నిర్వహించారు. ఆషాఢమాసంలో అమ్మవారికి ఆషాఢ పట్టి సమర్పించడం ఆర్యవైశ్యులకు ఆనవాయితీ. బుధవారం శ్రీరాంనగర్‌కు చెందిన ఆర్యవైశ్య మహిళలు వాసవీమాతకు పట్టుచీర, పూలు, పండ్లు, పసుపు, కుంకుమ, తదితర పూజాసామగ్రితో వెళ్లి అమ్మవారికి సమర్పించారు. కన్యకాపరమేశ్వరీదేవికి వడి బియ్యం పెట్టారు.

నేడు కో ఆప్షన్ సభ్యుడి ఎన్నిక

బ్రహ్మంగారిమఠం : మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు పుల్లయ్య(ఎస్సీ) అనారోగ్యంతో మృతి చెందడంతో ఖాళీ అయిన కోఆప్షన్ సభ్యత్వం భర్తీ చేయాలని ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు గురువారం మండల ప్రత్యేక సమావేశం ఉంటుందని ఎంపీడీఓ వెంగముని రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి అధ్యక్షతన ఎంపీటీసీలు మైనార్టీకి చెందిన వారిని కోఆప్షన్ సభ్యుడిగా ఎన్నుకుంటారని చెప్పారు. మైనార్టీలు ఉదయం 10 గంటలకు నామినేషన్ వేసిన తర్వాత ఎంపిక కార్యక్రమం ఉంటుందని ఎంపీడీవో తెలిపారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

పోరుమామిళ్ల : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భౌతికశాస్త్ర విభాగాధిపతిగా ఉన్న డాక్టర్ కె. వెంకటరావును బుధవారం కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ నరేష్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది శాలువా, పూలదండతో ఘనంగా సన్మానించారు.డాక్టర్ వెంకటరావు 'వర్ణపట శాస్త్రం, పదార్థాల విశ్లేషణ' రంగంలో చేసిన పరిశోధనకు తమిళనాడులోని తిరుచ్చిలో జరిగిన అంతర్జాతీయ ఆసియా పరిశోధన అవార్డుల ప్రదానోత్సవ సభలో ఆయన అంతర్జాతీయ అత్యుత్తమ పరిశోధన అవార్డు అందుకున్నారు. వెంకటరావు అవార్డు అందుకున్న సందర్భంగా బుధవారం ఆయన్ను కళాశాల సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నరేష్ మాట్లాడుతూ వెంకటరావుకు అవార్డు రావడం అభినందనీయమన్నారు.

నేడు లక్ష్మీపేటలో ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం

చాపాడు : మండల పరిధిలోని లక్ష్మీపేట గ్రామంలో గురువారం ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ కార్యక్రమంలో భాగంగా గురువారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మండల వైద్యాధికారి డాక్టర్ రాజేష్ కుమార్ తెలిపారు. గ్రామంలో ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ నిర్వహించే వైద్య శిబిరంలో అన్ని రకాలైన వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను పంపిణీ చేస్తామని వైద్యాధికారి తెలిపారు.

ఉపాధ్యాయురాలికి డాక్టరేట్

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక జమ్మలమడుగు రోడ్డులోని లక్ష్మి టవర్స్‌కు చెందిన తెలుగు ఉపాధ్యాయురాలు బి.గురురాధాదేవికి శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఈమె ''రాయలసీమ రచయిత్రుల కథల్లో స్త్రీ జీవితం'' అనే అంశంపై విశ్రాంత ఆచార్యులు ఎస్.రాజేశ్వరి పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్ లభించింది.

రైతుల కోసమే ఆర్బీకేలు



కామనూరు రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలిస్తున్న సంబటూరు ప్రసాద్‌రెడ్డి

ప్రొద్దుటూరు : రైతుల కోసమే ప్రభుత్వం గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసిందని రాష్ట్ర ఉద్యాన శాఖ సలహాదారుడు సంబటూరు ప్రసాద్‌రెడ్డి అన్నారు. మండలంలోని కామనూరు రైతు భరోసా కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు సేవలు అందించడం లేదని, రైతు భరోసా కేంద్రాలు వృథా అని మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ఆరోపించడం తగదన్నారు. ఇప్పటి వరకు ప్రభుత్వం 32,088 క్వింటాళ్ల వడ్లు కొనుగోలు చేసి వెంటనే డబ్బు చెల్లించడం జరిగిందన్నారు. రాష్ట్రంలోని ప్రతి ఆర్బీకే కేంద్రం ద్వారా రూ.10లక్షలు విలువ గల వ్యవసాయ పనిముట్లను రైతులకు ఇచ్చామన్నారు. మండల వ్యవసాయాధికారి శివశంకర్‌రెడ్డి, చెన్నమరాజుపల్లె సొసైటీ అధ్యక్షుడు సుబ్బారెడ్డి, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు ప్రశంసా పత్రాల పంపిణీ

మైదుకూరు : మైదుకూరు డిపోలో విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు బుధవారం డిపో అధికారులు ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జనరల్ ఏడీసీ ఎం.లక్ష్మయ్య, కండక్టర్లు కేసీ కొండయ్య, జి.రెడ్డయ్య, డ్రైవర్లు ఎంఎస్ నారాయణ, బి.శ్రీనివాసులు, ఎంఎస్ మన్యం, డి.శ్రీరాములు, మెకానిక్ ఆర్.బాబులకు డిపో మేనేజర్ శ్రీనివాసులు, ట్రాఫిక్ ఇన్‌చార్జి ఎ.మంజుల ఆదర్శ ఉత్తమ ఉద్యోగులుగా ప్రశంసా పత్రాలను అందజేశారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



మహిళకు సర్టిఫికెట్ అందిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

మైదుకూరు : అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలన్న ధ్యేయంతోనే సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. మండలంలోని మిట్టమానుపల్లె సచివాలయంలో బుధవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సమస్యలు తెలుసుకుని పథకాలు అందని వారికి అవసరమైన సర్టిఫికెట్లను అందజేసి పథకాలను అందేలా చేయడమే జగనన్న సురక్ష కార్యక్రమ ఉద్దేశమన్నారు. టీడీపీ హయాంలో పింఛను కోసం పంచాయతీ కార్యాలయాల వద్దకు వెళ్లి వృద్ధులు, వికలాంగులు పడిగాపులు కాయాల్సి వచ్చేదని చెప్పారు. ఇక పథకాలకు జన్మభూమి కమిటీ సిఫారసు ఉండాల్సిందేనన్నారు. కార్యక్రమంలో 500 మందికిపైగా సర్టిఫికెట్లు, పలువురికి కౌలు రైతుకార్డులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి కృష్ణమూర్తి, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమన్నారాయణరెడ్డి, మండల వైస్ ఎంపీపీ ఊటుకూరు రఘురామిరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ మూలె సుధాకర్‌రెడ్డి, ఎంపీడీఓ ఏవీ రమణారెడ్డి, తహసీల్దార్ అనురాధ, ఏఓ లక్ష్మీప్రసన్న, ఎంఈఓ పద్మలత, వైకేపీ ఏపీఎం సుజాత, మిట్టమానుపల్లె సర్పంచ్ చిన్న ఓబుళమ్మ, పప్పనపల్లె సర్పంచ్ వెంకటలక్షుమ్మ, వనిపెంట సర్పంచ్ గౌస్ లాజం, వైఎస్సార్‌సీపీ నాయకులు బండి నాగేంద్రప్రసాద్, బొర్రా సాంబశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజుపాలెంలో..

రాజుపాలెం : రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మండల ప్రత్యేకాధికారి రాఘవేంద్ర కుమార్ అన్నారు. మండలంలోని కొర్రపాడు గ్రామ సచివాలయం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11 రకాల ఉచిత సేవలు అందించేందుకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. ఎంపీడీఓ సయ్యదున్నీసా మాట్లాడుతూ గ్రామంలో 732 మందికి వివిధ రకాల సర్టిఫికెట్లు కావాలని దరఖాస్తు చేసుకున్నారని, వారందరికీ పంపిణీ చేశామని తెలిపారు. అనంతరం ఎంపీడీఓ, తహసీల్దార్ ఇందిరా రాణి, ఏపీఎం జయరాజ్‌లు లబ్ధిదారులకు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ వెలవలి శేఖర్ రెడ్డి, సర్పంచ్ శ్రీనివాసులరెడ్డి, పశువైద్యాధికారి లక్ష్మీదేవి, ఏపీఓ గంగయ్య, వీఆర్‌ఓ అశోక్, పంచాయితీ కార్యదర్శి బాబు, పీహెచ్ఎస్ విమలమ్మ, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష

చాపాడు : ప్రజలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని.. గ్రామాల్లో ఇంకా ఎవరైనా అర్హత కలిగిన వారుంటే వారి సమస్యలను పరిష్కరించేందుకే జగనన్న సురక్ష గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ తెలిదేల లక్ష్మయ్య పేర్కొన్నారు. మండలంలోని లక్ష్మీపేట గ్రామంలో బుధవారం జగనన్న సురక్ష గ్రామ సభ నిర్వహించారు. లబ్ధిదారులకు వివిధ రకాలైన ధృవీకరణ పత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి సురేష్‌రెడ్డి, సర్పంచ్ శ్రీవిద్య, ఇన్‌చార్జి ఎంపీడీఓ రాధాకృష్ణవేణి, మండల వ్యవసాయాధికారి మ్యాగి, డిప్యూటీ తహసీల్దారు భవానీ, గ్రామ సచివాలయ మండల కన్వీనర్ రామోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు జయరాజు, చంద్రమోహన్‌రెడ్డి, చంద్ర, గ్రామ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు అన్నవరంలో జగనన్న సురక్ష గ్రామ సభ

మండల పరిధిలోని అన్నవరం గ్రామంలో గురువారం జగనన్న సురక్ష గ్రామ సభ నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ రాధాకృష్ణవేణి తెలిపారు, ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు గ్రామసభ జరుగుతుందని, సచివాలయ పరిధిలోని ప్రజలు ప్రభుత్వ పరమైన సమస్యలను సభ దృష్టికి తీసుకురావచ్చని చెప్పారు.

బాబు, జగన్ పాలనను పోల్చి చూడండి

ప్రొద్దుటూరు : గడిచిన ఐదేళ్ల చంద్రబాబు పాలనను, ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్ పరిపాలనను పోల్చి చూడాలని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డులో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. చంద్రబాబు కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే ప్రజల కోసం పని చేశాడన్నారు. సీఎం జగన్ అధికారంలోకి వచ్చిన మరుసటి రోజు నుంచే అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారన్నారు. అందులో భాగంగానే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టి అధికారులను ఇంటింటికి పంపిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, కమిషనర్ వెంకటరమణయ్య, వార్డు కౌన్సిలర్ నూకా నాగేంద్రరెడ్డి, వార్డు సచివాలయాల ఇన్‌చార్జి కాకర్ల నాగేశేషారెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, నాయీబ్రాహ్మణ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు కిశోర్, అంజనేయస్వామి ఆలయ కమిటీ సభ్యుడు సుంకు కిశోర్ పాల్గొన్నారు.

అర్హులందరికీ మేలు చేయాలన్నదే సీఎం లక్ష్యం

బద్వేలు అర్బన్ : అర్హత ఉండి కూడా ప్రభుత్వ పథకాలకు దూరంగా ఉన్న వారిని గుర్తించి వారికి కూడా సంక్షేమ పథకాలు అందించాలన్న లక్ష్యంతోనే ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారని ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని అబ్బరాతివీధి సచివాలయం ఆవరణలో బుధవారం ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష క్యాంపులో ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంలో వచ్చిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి వీలైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, గిద్దలూరు ఎన్నికల పరిశీలకులు బంగారుశీనయ్య, వార్డు కౌన్సిలర్ గుర్రంరత్నమ్మ, మున్సిపాలిటీ కన్వీనర్ యద్దారెడ్డి, వార్డు ఇన్‌చార్జిలు శివయ్య, ప్రతాప్‌కుమార్, చెన్నకృష్ణారెడ్డి, వెంకటరత్నం, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకులు రాజేష్, నిరంజన్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డి, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష ద్వారా సత్వర సేవలు

కాశినాయన : జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు సత్వర సేవలు అందుతున్నాయని ఎంపీపీ నల్లేరుపోలమ్మ, ఎంపీడీఓ మైథిలి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కోడిగుడ్లపాడు గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లబ్ధిదారులకు ఉచితంగానే సర్టిఫికెట్లను ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు.కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ముజఫర్‌రహీమ్, మండల ఉపాధ్యక్షుడు వెంకటసుబ్బయ్యఆచారి, స్థానిక సర్పంచ్ బాలగురయ్య, సచివాలయ సిబ్బంది, పాల్గొన్నారు.

కలసపాడు : జగనన్న సురక్షతో అర్హులకు న్యాయం జరుగుతుందని మండల స్పెషలాఫీసర్ మురళీధర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని రాజుపాలెం గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్వే ద్వారా 160 మందిని గుర్తించి 150 మందికి వివిధ సర్టిఫికెట్లు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అంకనగురివిరెడ్డి, సూదారామకృష్ణారెడ్డి, సుదర్శన్, నారాయణయాదవ్, గృహసారథుల మండల కన్వీనర్ చిత్తా రాజశేఖర్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, ఏపీ టూరిజంశాఖ రాష్ట్ర డైరెక్టర్ పి.రామకృష్ణారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు ఎ.విజయభాస్కర్‌రెడ్డి, యువ నాయకుడు వెంకటరామిరెడ్డి, ఎంపీడీఓ మహబూబ్‌బీ, ఈఓపీఆర్డీ మురారి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

దువ్వూరులో..

దువ్వూరు : జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించనున్నట్లు ఎంపీడీఓ జగదీశ్వరరెడ్డి పేర్కొన్నారు. మంలంలోని ఇడమడక గ్రామ సచివాలయంలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత ఉండి ఎవరికైనా సంక్షేమ పథకాలు అందకుంటే వారిని వలంటీర్లు త్వరగా గుర్తించాలన్నారు. వారికి ఆ సర్టిఫికెట్లను ఉచితంగా అందిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నరసమ్మ, ఎంపీటీసీ ఇమాంబీ, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీకాంత్, నాగరాజు, మునిరెడ్డి, ఏఓ అమరనాథరెడ్డి, సచివాలయ సిబ్బంది, గృహసారథులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివప్రసాదరెడ్డి



బద్వేలు: ధృవీకరణ ప్రతాలను అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

సేవకు సలాం



ఆపదలో అండగా..



బి.మఠం మండలం లింగాలదిన్నెపల్లెలో సువర్ణకు రేషన్‌కార్డు అందిస్తున్న వలంటీరు భాస్కర్‌రెడ్డి

మండలంలోని లింగాలదిన్నెపల్లెకు చెందిన భూమిరెడ్డి సువర్ణను నెల్లూరు జిల్లా కడియంపాడుకు చెందిన సుబ్బారెడ్డితో వివాహం పెద్దలు చేశారు. తాపీ పని చేసే సుబ్బారెడ్డి ఐదేళ్ల కిందట ప్రమాదవశాత్తూ మృతి చెందాడు. దీంతో సువర్ణ ఇద్దరు పిల్లలతో జీవనోపాధి కోసం పుట్టింటికి చేరింది. ఆధార్‌కార్డులో అడ్రస్ మార్చుకుని పింఛను, రేషన్‌కార్డు పొందడానికి అప్పటి టీడీపీ ప్రభుత్వంలోని జన్మభూమి కమిటీల సభ్యులను ఆశ్రయించినప్పటికీ వారు పట్టించుకోలేదు. సువర్ణ పలుమార్లు అడిగినా ఫలితం లేకపోయింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వలంటీరు వ్యవస్థ ఏర్పడింది. వలంటీరు భాస్కర్‌రెడ్డి సువర్ణ ఇంటికి వచ్చి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా? అని అడిగాడు. సువర్ణ సమస్య వివరించడంతో ముందు ఆధార్ ఇప్పించిన వలంటీరు ఆ తర్వాత ఆమెకు పింఛను, రేషన్ కార్డు ఇప్పించాడు.

బ్రహ్మంగారిమఠం

నా పాలిట దేవుడు వలంటీరు

అన్ని కోల్పోయిన నాకు వలంటీరు ఆధారం చూపాడు. ఆయన నా పాలిట దేవుడు. మమ్మల్ని ఆదుకున్న వలంటీరుకు, వలంటీరు వ్యవస్థను ఏర్పాటుచేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి మా కుటుంబం ఎప్పటికీ రుణపడి ఉంటుంది.

- సువర్ణ, లింగాలదిన్నెపల్లె, బి.మఠం మండలం

ఆస్పత్రికొచ్చి పింఛన్ అందజేసింది



గుంటూరుకు వెళ్ళి కిరణ్‌కుమార్‌కు పింఛను అందజేస్తున్న వలంటీరు జ్యోతి

నా భర్త గడ్డె కిరణ్‌కుమార్ కేన్సర్‌తో బాధపడుతూ కొన్ని నెలల కిందట గుంటూరులోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందేవాడు. ఆ సమయంలో రెండు నెలలు పింఛను తీసుకోలేదు. విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన వలంటీరు యడవల్లి జ్యోతి తన సొంత ఖర్చుతో గుంటూరుకు వచ్చి నా భర్తకు పింఛను అందజేసింది. ఆస్పత్రిలో ఉన్న తమకు ఆ డబ్బు ఎంతో ఉపయోగపడింది. ఇంత సాయం చేసిన వలంటీరుకు రుణపడి ఉంటాం.

- గడ్డె వెంకటలక్షుమ్మ, మహానందిపల్లె, కలసపాడు మండలం

వలంటీరు ద్వారా సపరేట్‌గా రేషన్ కార్డు మంజూరు



నాలుగేళ్ల క్రితం నాకు వివాహమైంది. నా తండ్రి ఆర్టీసీ కండెక్టర్‌గా ఉండటంతో సఫరేట్‌గా రేషన్ కార్డు మంజూరు కాలేదు. విషయం తెలియడంతో వలంటీరు ప్రొద్దుటూరు దస్తగిరి సచివాలయంలో దరఖాస్తు చేయించి నా తండ్రి కార్డు నుంచి మమ్మల్ని వేరు చేయించారు. బుధవారం జరిగిన జగనన్న గ్రామ సభలో మాకు రేషన్ కార్డు మంజూరైనట్లు అధికారులు ధృవీకరణ పత్రం అందించారు. వలంటీరుకు ధన్యవాదాలు.

- బైరి సురేంద్ర కుమార్, లబ్ధిదారుడు, కేతవరం, లక్ష్మీపేట, చాపాడు మండలం

వలంటీర్ రుణం తీర్చుకోలేనిది



ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి కొర్రపాటి చిన్న వెంకటేషు. వైఎస్సార్ జిల్లా రాజుపాళెం మండలంలోని గోపాయపల్లె గ్రామం. ఆయన వృత్తి రీత్యా బార్బర్ కావడంతో అదే పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రాష్ట్ర ప్రభుత్వం బార్బర్లకు ఏడాదికి రూ.10వేల చొప్పున ఆర్థిక సహాయం అందజేస్తున్న సంగతి తెలిసిందే. చిన్న వెంకటేషుకు కూడా ప్రభుత్వం నుంచి సాయం అందుతుండేది. అయితే ఆయన అడ్రస్ బియ్యం కార్డులో ప్రొద్దుటూరు అని ఉండగా ఆధార్ కార్డులో మాత్రం గోపాయపల్లె అని ఉంది. ఇలా వేర్వేరుగా అడ్రస్ ఉన్న కారణంగా చిన్న వెంకటేషుకు ప్రభుత్వ సాయం ఆగిపోయే పరిస్థితి తలెత్తింది. వలంటీర్ రాజేష్ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడంతో చిన్న వెంకటేషుకు యథావిధిగా తన అకౌంట్‌లో ప్రభుత్వ సాయం రూ.10 వేలు అకౌంట్‌లో జమ అయ్యింది. ఇప్పుడు ఏటా ప్రభుత్వ లబ్ధిని చిన్న వెంకటేషు పొందుతున్నాడు. తనకు వలంటీరు చేసిన సాయాన్ని మరువలేనని చిన్న వెంకటేషు చెప్పాడు.

- చిన్న వెంకటేషు, గోపాయపల్లె, రాజుపాళెం మండలం

సిమెంటు రోడ్డు పనులకు ఎమ్మెల్యే భూమి పూజ

ప్రొద్దుటూరు : స్థానిక 22వ వార్డు మహ్మదీయ కాలనీ–3లో రూ.15లక్షలతో సిమెంటు రోడ్డు, డ్రైనేజీ కాలువ పనులకు బుధవారం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి భూమి పూజ చేశారు. పట్టణంలో అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి నాగరాజు, వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి, 22 వార్డు ఇన్‌చార్జి హిదాయత్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, ఆర్‌పీసీఏ మెంబర్ కాకర్ల నాగేశేషారెడ్డి, కౌన్సిలర్లు వడ్ల ఖలీల్, కమాల్ బాషా, 25వ వార్డు ఇన్‌చార్జి నూరి, 23వ వార్డు ఇన్‌చార్జి వడ్ల దాదాపీర్ పాల్గొన్నారు.

కొత్త హౌసింగ్ బోర్డులో పార్కు ఏర్పాటు చేయిస్తా

గోపవరం గ్రామ పంచాయతీ పరిధిలోని కొత్త హౌసింగ్ బోర్డులో పార్కును ఏర్పాటు చేయిస్తానని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. స్థానికుల కోరిక మేరకు ఎమ్మెల్యే బుధవారం సాయంత్రం కొత్త హౌసింగ్ బోర్డు కాలనీకి వెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గోపవరం గ్రామ పంచాయతీకి సంబంధించి ఉన్న స్థలంలో పార్కును నిర్మించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని, తాగునీరు, డ్రైనేజి కాలువల సమస్యను పరిష్కరించాలని గ్రామ పంచాయతీ పాలక వర్గానికి ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డిని కాలనీ వాసులు సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ గద్ద మోషా, ఉప సర్పంచ్ బీరం రాఘవేంద్రారెడ్డి, కోఆప్షన్ సభ్యుడు ఖాదర్ బాషా, సచివాలయ కన్వీనర్ రామచంద్ర, పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో మైదుకూరు మున్సిపాలిటీ

- ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి
- రూ.15కోట్లతో డ్రైనేజీ కాలువల అభివృద్ధి పనులకు భూమి పూజ

మైదుకూరు : పట్టణంలో మురుగు నీటి కాలువల అభివృద్ధి పనులకు బుధవారం ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మైదుకూరులో చిన్న చిన్న డ్రైనేజీలను రూ.6 కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. కేసీ కాలువపై క్రాసింగ్‌రోడ్డును చేపట్టనున్నట్లు తెలిపారు. మురుగునీటిని శుద్ధి చేసేందుకు రూ.12.5 కోట్లతో ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమన్నారాయణరెడ్డి, వైస్ చైర్మన్ షరీఫ్, వైస్ ఎంపీపీ ఊటుకూరు రఘురామిరెడ్డి, కోఆప్షన్ సభ్యులు దండు సుబ్బయ్య, కందనూరు షరీఫ్, వార్డు ఇన్‌చార్జిలు సన్నా శ్రీనురావు, ఖాదర్, రామదాసు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గల్లా నరసింహారెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలు కిరణ్మయి, గోశెట్టి లక్షుమయ్య, సర్పంచ్ అన్నలూరు శ్రీను, భూమిరెడ్డి సుబ్బరాయుడు, దాదాపీర్, పిల్లి నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి



సీజనల్ వ్యాధుల గురించి విద్యార్థులకు వివరిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు

మైదుకూరు : ప్రజలు ప్రభుత్వం అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు అన్నారు. మండలంలోని వరదాయపల్లెలో బుధవారం నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో నిర్వహించే వైద్య పరీక్షలు, మందుల గురించి ప్రజలకు వివరించారు. అనంతరం జీవీ సత్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శ్రీనాథ్ రెడ్డి, పీహెచ్ఎస్ వెంకటలక్ష్మి, సూపర్‌వైజర్లు రజియా సుల్తాన్, జనార్దన్, ప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బాలికలకు ఋతుక్రమంపై అవగాహన

పోరుమామిళ్ల : పట్టణంలోని ఓఎల్ఎఫ్ బాలికోన్నత పాఠశాలలో బుధవారం మదర్ థెరిస్సా ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాలికలకు ఋతుక్రమంపై అవగాహన కల్పించారు. ఫౌండేషన్ నిర్వాహకురాలు ప్రజ్వలరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బ్రయాన్స్ హాస్పిటల్ వైద్యురాలు డాక్టర్ మౌనికరెడ్డి, ఫారినర్ టెర్రీ గిల్‌క్రిస్ట్ మాట్లాడుతూ ప్రతినెలా 3 రోజులపాటు వచ్చే నెలసరి రుతు సమస్యలు సర్వసాధారణమన్నారు. ఆ సమయంలో మంచి ఆహారం తీసుకోవాలని, పరిశుభ్రత పాటించాలని సూచించారు.ఎఫ్‌సీయస్ సేవాసంస్థ వ్యవస్థాపకుడు చిత్తా తోమాస్‌రెడ్డి, డాక్టర్ గీతల సహకారంతో 200 మంది విద్యార్థులకు కామిక్ బుక్స్ విద్యార్థులకు అందచేశారు. కార్యక్రమంలో విదేశీయులు జాన్, థామస్, ప్రధానోపాధ్యాయురాలు ఆరోగ్యరాణి, సిస్టర్ విజయరాణి, జసింత, టీచర్లు జానీ, కావేరి, అనిత, మల్లిక పాల్గొన్నారు.

దువ్వూరు పీఏసీఎస్ అధ్యక్షుడిగా విశ్వేశ్వర్‌రెడ్డి

దువ్వూరు : దువ్వూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షుడిగా ఇరగంరెడ్డి విశ్వేశ్వర్ రెడ్డి నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తన నియామకం పట్ల సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యేలు శెట్టిపల్లె రఘురామిరెడ్డి, రవీంద్రనాథ్ రెడ్డిలకు విశ్వేశ్వర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

'దళిత ద్రోహి ప్రవీణ్ కుమార్‌రెడ్డి'

ప్రొద్దుటూరు : దళితుల భూములను ఆక్రమించుకోవాలని చూస్తున్న ప్రొద్దుటూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి దళిత ద్రోహి అని వైఎస్సార్‌సీపీ దళిత నేత గోసా మనోహర్ ఆరోపించారు. బుధవారం గోసా మనోహర్ మాట్లాడుతూ 50 ఏళ్లుగా మేడిక జయరాజుకు మూలవారిపల్లె, తాళ్లమాపురం గ్రామాల్లో 5.29 ఎకరాల భూమిని సాగు చేసుకుంటున్నారని తెలిపారు. ఆయన మరణాంతరం ఆయన భార్య, కుమార్తెలు ఆ భూమిని సాగు చేసుకుంటున్నారన్నారు. ప్రవీణ్ ఆరోపించిన విధంగా 1983–1985 సంవత్సరాల్లో ఎటువంటి లే అవుట్ లేదని, దానికి సంబంధించిన యజమానులు లేరన్నారు. ఈ భూమి వెనుకాల టీడీపీకి చెందిన సీనీ హబ్ రాజేశ్వరరెడ్డి ఇంజనీరింగ్ కాలేజీ ఉందని తెలిపారు. ఆ కళాశాలకు మైదుకూరు రోడ్డు మెయిన్ హైవే నుంచి లోపలికి రస్తా వేసుకొని 5.29 ఎకరాలను కబ్జా చేయాలని మేడిక జయరాజు కుటుంబాన్ని అనేక ఇబ్బందులు పెట్టారన్నారు.

సంక్షేమాన్ని వివరిస్తూ..సమస్యలు వింటూ ..



దిగువ తంబళ్ళపల్లెలో లబ్ధిదారుడికి సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే సుధ

కలసపాడు : వైఎస్సార్‌సీపీ నాలుగేళ్ళ పాలనలో చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకుంటూ ఎమ్మెల్యే డాక్టర్ సుధ పర్యటన సాగింది. మండలంలోని దిగువ తంబళ్ళపల్లె, సింగరాయపల్లె గ్రామాల్లో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో వీధిలైట్లు, డ్రైనేజీ, విద్యుత్ స్తంభాలు, సీసీ రోడ్లు తదితర సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్ళగా సమస్యలను పరిష్కరించాలని ఆమె అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అంకనగురివిరెడ్డి, సూదారామకృష్ణారెడ్డి, సుదర్శన్, నారాయణయాదవ్, పురుషోత్తంరెడ్డి, చిత్తారాజశేఖర్‌రెడ్డి, పులివీరారెడ్డి, యువ నాయకుడు వెంకటరామిరెడ్డి, కొండాదామోదర్‌రెడ్డి, సింగరయ్య, సర్పంచ్ సంజయ్‌రాజు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

పశువైద్య కళాశాల విద్యార్థికి జాతీయ అవార్డు



సుదర్శన్‌ను అభినందిస్తున్న పశువైద్య కళాశాల అసోసియేట్ డీన్ వైకుంఠరావు, డాక్టర్ శ్రీలత

ప్రొద్దుటూరు : స్థానిక పశువైద్య కళాశాలలో నాలుగో సంవత్సరం చదువుతున్న విద్యార్థి కె.సుదర్శన్ జాతీయ అవార్డును సాధించినట్లు కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి.వైకుంఠరావు తెలిపారు. చెన్నై పశువైద్య కళాశాలలో ఈనెల 8, 9 తేదీల్లో నిర్వహించిన జాతీయ సదస్సులో వ్యాధి నిర్ధారణ విభాగంలో 'డయాగ్నోస్టిక్ సైటాలజీ'కి సంబంధించి పశువుల్లో క్యాన్సర్ నిర్ధారణపై సుదర్శన్ పరిశోధన పత్రాన్ని సమర్పించాడు. చెన్నై పశువైద్య కళాశాల డీన్ ప్రొఫెసర్ ఆర్.కరణాకరన్, ప్రముఖ పాథాలజీ శాస్త్రవేత్తల సమక్షంలో సుదర్శన్ ఈ జాతీయ అవార్డు అందుకున్నాడు. బుధవారం విద్యార్థి సుదర్శన్‌ను కళాశాల డీన్ వైకుంఠరావు, పశువైద్య వ్యాధి నిర్ధారణ విభాగం అధిపతి డాక్టర్ శ్రీలత, బోధన సిబ్బంది అభినందించారు.